క్లుప్తంగా

మట్టి నమూనాలు పరిశీలించాలి

పెనమలూరు: రైతులు పొలాల్లో మట్టి నమూనాలు పరిశీలించాలని శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి అన్నారు. యనమలకుదురులో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యాన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ మట్టి నమూనా ఫలిత పత్రాల ఆధారంగా పంటల సాగులో ఎలాంటి ఎరువులు వాడాలో తెలుస్తుందని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు వి.అహల్య, రైతులు పాల్గొన్నారు.

నలుగురు ప్రధానోపాధ్యాయుల బదిలీ

పెనమలూరు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన నలుగురు ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. కానూరు హెచ్ఎంగా ఉన్న ఆర్.కమల వీరులపాడు మండలం జయంతి పాఠశాలకు, కానూరుకు కలిదిండి మండలం భాస్కరరావుపేట నుంచి పి.విజయలక్ష్మి వచ్చారు. పోరంకి పాఠశాలలో హెచ్ఎం గద్దె సూర్యకుమారి జగ్గయ్యపేట గౌరవవరానికి బదిలీ అవ్వగా ఆమె స్థానంలో మానికొండ నుంచి పద్మవాణి వచ్చారు. యనమలకుదురు హెచ్ఎం డి.శ్రీను పెండ్యాలకు బదిలీ అవ్వగా ఆయన స్థానంలో వల్లూరుపాలెం నుంచి వై.శ్రీనివాస్ హెచ్ఎంగా వచ్చారు. వణుకూరు హెచ్ఎం పీఎల్ఎస్ ప్రసాద్ నెప్పల్లికి బదిలీ అవ్వగా గన్నవరం దావాజీగూడెం నుంచి విజయరామారావు వణుకూరు హెచ్ఎంగా వచ్చారు.

'ఉపాధి'తో చెరువుల అభివృద్ధి

ఉంగుటూరు: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చెరువులు, పంట కాలువల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. ముక్కపాడులో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

నున్న(విజయవాడరూరల్): ఖరీఫ్ సీజన్లో రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని జెడ్పీటీసీ కె.సువర్ణరాజు సూచించారు. నున్న రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెటర్నరీ సర్జన్ పి.లక్ష్మి, ఏఈఓ సురేష్ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

కంకిపాడు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని కంకిపాడులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్టీయూ భవన్లో సంఘ నేతలు కేక్ కోసి వేడుకలు జరుపుకున్నారు. తొలుత ఎస్టీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండవ శ్రీనివాస్, పీకా ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

హనుమాన్జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కొత్తపల్లిలో అగ్నిప్రమాదం జరగడతో పూరిల్లు దగ్ధమైంది. గ్రామస్తురాలు కస్తూరి లక్ష్మీ మాధవికి చెందిన తాటాకిల్లులో శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. హనుమాన్జంక్షన్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వటంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇంట్లోని గృహోపకరణాలు, విలువైన వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ మోహనరావు తెలిపారు. అగ్నిప్రమాదానికి విద్యుత్ షాట్సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు.

ఆణిముత్యాలను అందిస్తున్నారు

పమిడిముక్కల: ప్రభుత్వ బడుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆణిముత్యాలను అందిస్తున్నారని సర్పంచ్ జంపాన ధనలక్ష్మి అన్నారు. తాడంకి జెడ్పీ పాఠశాలలో శుక్రవారం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఈడే శ్యామలరేఖ, జలసూత్రం హేమంత్లను పాస్టర్ ఏసురత్నం ఆధ్వర్యంలో సత్కరించారు.

వ్యవసాయ శిక్షణ.. భవితకు నిచ్చెన..

- వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్న ఎలిప్
- 45 రోజుల ఉచిత శిక్షణ
- స్వయం ఉపాధితో లాభసాటి వ్యవసాయం
- 48 శాతం సక్సెస్గా యూనిట్ల స్థాపన


ఆర్గానిక్ బెల్లం తయారు చేస్తున్న అశోక్రెడ్డి

ఉంగుటూరు(గన్నవరం): ఆధునిక పద్ధతులను అందుబాటులోకి తెచ్చి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి వ్యవసాయ పట్టభద్రులకు శిక్షణ ఇస్తున్నారు. వారికి ఉచిత శిక్షణ ఇస్తూ ఉపాధి మార్గం చూపడానికి ఎలిప్ ఇండియా, సీఈడీ అవకాశమిస్తున్నాయి. అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ కోర్సుల్లో శిక్షణ పొంది వ్యసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి పారిశ్రామిక వేత్తలు ఎదగడానికి ఈ సంస్థలు తోడ్పడుతున్నాయి. శిక్షణ తర్వాత కొంతమంది ఆర్థికంగా అభివృద్ధి చెంది మరి కొంతమందికి ఉపాధి కల్పించామని నిరూపించారు. దీనికి కృష్ణా జిల్లాలోని ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ఉచిత శిక్షణకు వేదికైంది. వ్యవసాయం, పశుపోషణ, ఉద్యానం వంటి విభాగాల్లో విద్యనభ్యసించిన పట్టభద్రులకు కేంద్ర వ్యవసాయ శాఖ సహకారంతో ఎలిప్ ఇండియా ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎంటర్ప్రెన్యూర్ డెవలప్మెంట్.. అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ కోర్సుల్లో 45రోజులు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది.

నాలుగేళ్లుగా..

స్వర్ణభారత్ ట్రస్ట్లో ఎలిప్ ఆధ్వర్యాన నాలుగేళ్లుగా శిక్షణ ఇస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ప్రాజెక్ట్ డైరెక్టర్లు వారి అనుభవాలు, మెలకువలను వివరిస్తారు. విజ్ఞాన ప్రదర్శనలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రాలు, వెటర్నరీ కాలేజీ యూనిట్ల వద్దకు శిక్షణార్థులను తీసుకువెళతారు. ఏదైనా ఉత్పత్తిని మార్కెటింగ్ విధానంలో ఉన్న డిజిటల్ మార్కెటింగ్, డిజైన్ థింకింగ్, అగ్రిటూరిజమ్ మార్కెటింగ్ వంటి అంశాల్లో శిక్షణనిస్తారు. ఈ సర్టిఫికెట్ ద్వారా 36 శాతం రాయితీపై రూ.20 లక్షల వరకు బ్యాంకులు రుణం మంజూరు చేస్తాయి. రుణం కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరిస్తారు. శిక్షణతోపాటు భోజనం, వసతి ఉచితంగా అందజేస్తున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో వ్యాపారం చేసేందుకు ఈ శిక్షణ ఉపయుక్తమవుతుంది.

నాలుగేళ్లలో 257 మందికి ఉచిత శిక్షణ



స్వర్ణభారత్ ట్రస్ట్లో ఎలిప్ ఇండియా ద్వారా నాలుగేళ్లుగా ఎనిమిది బ్యాచ్లు 257మందికి అగ్రిబిజినెస్, అగ్రిక్లినిక్లో శిక్షణ ఇచ్చాం. 48శాతం సక్సెస్గా యూనిట్లు స్థాపించారు. ఐదుగురికి బ్యాంకు రుణం లభించింది. వ్యవసాయ విద్యను అభ్యసించిన పట్టభద్రులకు అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ ఉచిత శిక్షణ కోర్సు ఉపయోగకరంగా ఉంటుంది. వివరాలకు 9441266769లో సంప్రదించాలి.

– పోలవరపు శోభారాణి, నోడల్ ఆఫీసర్, అగ్రిక్లినిక్, అగ్రిబిజినెస్ ట్రైనింగ్ సెంటర్

జాతీయ స్థాయిలో అవార్డులు

స్వర్ణభారత్ ట్రస్ట్లో ఎలిప్ ద్వారా శిక్షణ పూర్తి చేసి వ్యవసాయ అనుబంధ రంగాల్లో పారిశ్రామికవేత్తలుగా ఎదిగి జాతీయస్థాయిలో కొందరు అవార్డులు పొందారు. ప్రకాశం జిల్లాకు చెందిన గాదే అశోక్రెడ్డి సేంద్రియ చక్కెర ఉత్పత్తుల యూనిట్ను స్థాపించారు. గుంటూరు జిల్లా వాసి కల్లం పావని సంధ్య ఆర్గానిక్ పసుపు, పసుపు కారం ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించారు. వీరిద్దరూ ఆయా రంగాల్లో రాణించడంతో వారిని జాతీయ విస్తరణ సంస్థ నగదు, ప్రశంసాపత్రాలతో సత్కరించింది.

నియోజకవర్గానికి రూ. 2 కోట్ల ఎంపీ నిధులు


అభివృద్ధిపై చర్చిస్తున్న ఎంపీ బాలశౌరి , ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి నిధులు కేటాయించారు. కానూరు వందడుగుల రోడ్డులోని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాల్సి ఉందని ఎంపీ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించి తన నిధుల నుంచి నియోజకవర్గం అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్కుమార్, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్టకు ఏర్పాట్లు పూర్తి


కంకిపాడు శివాలయం


సిద్ధమైన ధ్వజస్తంభం

- నేటి నుంచి కంకిపాడు శివాలయంలో ప్రత్యేక పూజలు
- 12న ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

కంకిపాడు: స్థానిక గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి(శివాలయం) దేవస్థానంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ట కార్యక్రమానికి దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నెల 10(శనివారం) నుంచి ఆలయంలో విశిష్ట పూజా కార్యక్రమాలు చేయనున్నారు. పునఃప్రతిష్ట నేపథ్యంలోలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మహా కుంభాభిషేకం నిర్వహణకు దేవాదాయ శాఖ, ఆలయ ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఇప్పటికే బారికేడ్లు, క్యూలైన్లను సిద్ధం చేశారు. యాగశాలను పూర్తి చేశారు. ఏర్పాట్లను నిర్వాహక ప్రతినిధులు కొల్లిపర సీతారాంబాబు, చవట నరసింహారావు, యెండూరి శ్రీనివాసరావు, పురాణం లీలాప్రసాద్, బోగాదుల తాతారావు, తంబాబత్తుల అంజిబాబు, ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి రాజా రమేష్ పర్యవేక్షిస్తున్నారు. 10, 11, 12 తేదీల్లో విశేష పూజలు చేయనున్నారు. 12న ధ్వజస్తంభ పునఃప్రతిష్ట మహోత్సవం జరగనుంది.

నాగేశ్వరరెడ్డికి కన్నీటి వీడ్కోలు


నాగేశ్వరరెడ్డి అంతిమయాత్ర

ఉయ్యూరు: రైతు నాయకుడు బొమ్మారెడ్డి నాగేశ్వరరెడ్డికి కన్నీటి వీడ్కోలు పలికారు. మండలంలోని పెద ఓగిరాల గ్రామానికి చెందిన బొమ్మారెడ్డి నాగేశ్వరరెడ్డి (85) అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. రైతుగా, మంచి వ్యక్తిగా పేరు గడించిన నాగేశ్వరరెడ్డి భౌతికకాయాన్ని శుక్రవారం బంధువులు, స్నేహితులు, పెద ఓగిరాల, చిన ఓగిరాల, ఆకునూరు, చలివేంద్రపాలెం గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇంటి నుంచి శ్మశానవాటిక వరకూ నాగేశ్వరరెడ్డి భౌతికకాయానికి అశ్రునయనాలతో అంతిమవీడ్కోలు పలికారు. కుమారులు రమేష్రెడ్డి, వెంకటరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విజయవాడ టౌన్ డివిజన్ విద్యుత్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ హెచ్చరించారు. పాయకాపురం విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ సుధాకర్ మాట్లాడుతూ.. 2,456 విద్యుత్ సర్వీసులను 40 బృందాలు తనిఖీ చేశాయన్నారు. వీటిలో 208 సర్వీసులు అనధికారికంగా వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. వారి నుంచి రూ.5.84 లక్షల అపరాధ రుసుంగా వసూలు చేశామన్నారు.

కొత్త దారి



టీడీపీ ప్రభుత్వం హయాంలో అధ్వానంగా మారిన కంకిపాడు లాకురోడ్డు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీసీ రోడ్డుగా అభివృద్ధి చెందిన కంకిపాడు లాకురోడ్డు

కంకిపాడు: కొన్నేళ్లు గోతులమయంగా కనిపించిన కంకిపాడు లాకు రోడ్డుకు కొత్త కళ వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్డును పూర్తిగా విస్మరిస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్త దారి వేసింది. గత ప్రభుత్వ హయాంలో అధిక లోడుతో ఉన్న ఇసుక లారీల రాకపోకలతో రోడ్డు అధ్వానంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు అభివృద్ధి అంశాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో జిల్లా పరిషత్ సాధారణ నిధులు, ఎస్సీ, ఎస్టీ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. వీటితో గతేడాది డిసెంబరు 22న కంకిపాడు లాకు రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తయ్యాయి. రోడ్డు మార్జిన్లలో వాహనదారులు, ప్రజల భద్రత రీత్యా బరంతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. త్వరలో రోడ్డును ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


తెన్నేరులో లెమన్ స్పూన్ ఆడుతున్న చిన్నారులు


పురుషోత్తపట్నంలో తాడులాగుడు పోటీలో విద్యార్థులు

కంకిపాడు: విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా తెన్నేరు శాఖ గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, ఇతర ఆటల పోటీలు నిర్వహించారు. కంకిపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: విద్యారులకు ఆటల పోటీలతో శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం స్థానిక లైబ్రరీ వద్ద విద్యార్థులకు తాడు లాగుడు పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ముస్తాబాద శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు పేపర్ డిజైన్లు తయారు చేశారు.

హోండా షైన్ 100 సీసీ బైక్ ఆవిష్కరణ



పెనమలూరు: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ 'హోండా మోటర్ సైకిల్' కొత్తగా మార్కెట్లోకి విడుదల చేసిన షైన్ 100 సీసీ బైక్ను గన్నవరంలో సంతోష్ హోండా ఆధ్వర్యంలో శుక్రవారం లాంచ్ చేశారు. స్థానిక ఆల్ఫా హోటల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హోండా ఏరియా సేల్స్ ఇన్చార్జ్ మంజునాథ్ పాటిల్, సర్వీస్ ఇన్చార్జ్ హర్షసన్, దావాజిగూడెం, బుద్ధవరం పాల సొసైటీల అధ్యక్షులు గొంది నరేంద్ర, వెంకటకృష్ణారావు ఆవిష్కరించారు. పాటిల్ మాట్లాడుతూ కేవలం రూ.65 వేలు (ఎక్స్-షోరూమ్) విలువైన బైక్ ఎక్కువ మైలేజ్తో పాటు తక్కువ మెయింటెనెన్స్తో ఐదు కలర్ ఆప్షన్లతో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ముందుగా బుక్ చేసుకున్న ఇద్దరు కస్టమర్లకు వాహనాలను అందజేశారు.

ఆరోగ్యకరమైన వాతావరణంలో సేవలందించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆరోగ్యకమైన వాతావరణంలో అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవలు అందించాలని నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు.

బదిలీపై వెళ్లిన తహసీల్దార్కు ఆత్మీయ వీడ్కోలు


టీవీ సతీష్ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కంకిపాడు: ప్రతి ఒక్కరికీ మెరుగైన సేవలు అందిస్తూ టీవీ సతీష్ ఆత్మబంధువు అయ్యారని వక్తలు ప్రశంసించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కంకిపాడు తహసీల్దార్గా పనిచేస్తున్న టీవీ సతీష్ కలెక్టరేట్ స్పెషల్ తహసీల్దార్గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పీఎస్వీ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

దీంతో వారిద్దరికీ ఆత్మీయ వీడ్కోలు, స్వాగత సభ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం రాత్రి నిర్వహించారు. టీవీ సతీష్, పీఎస్వీ ప్రసాద్లను ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తూ మెరుగైన సేవలు అందించటంలో టీవీ సతీష్ పని తీరు అభినందనీయమన్నారు. అందరినీ ఆదరించేవారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఇన్చార్జి ఆర్డీఓ లక్ష్మీప్రసాద్రెడ్డి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, కమ్మ, నగర కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నక్కా శ్రీనివాసరావు, వైస్ ఎంపీటీసీ ధూళిపూడి కృష్ణకిషోర్, ఎంపీటీసీలు చిట్టూరి ప్రసాద్, ఒడుగు శ్రీనివాసరావు, షేక్ అమీనాబి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

పెనమలూరు: యనమలకుదురులో శుక్రవారం లక్ష్మణ హనుమత్ సమేత శ్రీసీతారామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభమైంది. ఈ నెల 9నుంచి 12వ తేదీ వరకు గ్రామంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు శుక్రవారం విష్వక్సేన పూజ, అంకురార్పణ, వాస్తుహోమం, పూజలు నిర్వహించారు. శనివారం కూడా ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

